# తెర వెనుక

— దాశరథి రంగాచార్య

రవి నిలిచిపోయాడు—గేటుముందు గూర్ఖాను చూచి.

ఎన్నో ఆశలు పెంచుకొని వచ్చాడు - అన్నీ కూలిపోయాయి. అసలు తనకు ప్రవేశం లభిస్తుందా అనుకున్నాడు. పరంధామయ్య బంగళా చూచాడు. తనను చూసుకున్నాడు. తన వేషం తనకే చిరాకనిపించింది. కొంతలో కొంత సిగ్గనిపించింది.

రవి గూర్ఖాను చూచాడు—బంగళాను చూచాడు, లాభం లేదను కున్నాడు. వెనక్కు తిరిగి వెళ్ళిపోదామనుకున్నాడు. అనుకున్నాడేగాని వెనక్కు తిరగలేదు. ముందడుగువేసి గబగబా సాగిపోయాడు. గేటు దాటాడు, గూర్ఖా రవిని ఆపలేదు. అయినా గుండె గుబులు ఆగలేదు రవికి.

రవి పరంధామయ్యను మెచ్చుకున్నాడు. గూర్ఖాను మెచ్చుకున్నాడు. వెనక్కు చూడకుండా మెట్లెక్కాడు.

రవి మెట్లెక్కి నిలిచిపోయాడు-తివాచీని చూచి నిలిచిపోయాడు. రవి తివాచీని చూచాడు—సొగసుగా ఉంది. తన కాళ్ళు చూచుకున్నాడు. మొరటుగా వున్నాయి. తివాచీ శుభ్రంగా వుంది—రవి కాళ్ళు దుమ్ము కొట్టుకొని ఉన్నాయి.

రవి రెంటినీ చూచాడు. కాళ్ళు దులుపుకున్నాడు. తివాచీకి అంట కుండా అడుగుపెట్టాడు—వరండాలో ప్రవేశించాడు. వరండా విశాలంగా వుంది. నిశ్శబ్దంగా ఉంది. దిగాలుపడి చూస్తున్నాడు రవి.

"ఎవరో వచ్చారు!" చిలక పలికింది.

రవి ఉలిక్కిపడి చూచాడు.

పంజరంలో చిలక పలికింది. రవికి ముచ్చటవేసింది. పరంధామయ్యను మళ్ళీ మనసులో మెచ్చుకున్నాడు, చిలకను చూస్తూ నుంచున్నాడు. చిలక అందం చూడ్డంలో మునిగిపోయాడు.

''ఎవరు కావాలి?" ఒక నౌకరు వచ్చి అడిగాడు.

అది రవికి వినిపించలేదు. రెండోసారి నౌకరు గట్టిగా అడుగుతే వినిపించింది రవికి, కాస్త తడబడ్డాడు.

"పరంధామయ్యగారి దర్శనానికి వచ్చాను" వినయంగా వివరించాడు రవి

వచ్చినవాడు రవిని పురుగును చూచినట్టు చూచాడు—వస్తారుండు అని చెప్పివెళ్ళిపోయాడు.

రవికి వచ్చినవాడిమీద కోపంవచ్చింది—తనను చూచుకున్నాడు కోపం దిగిపోయింది.

వరండాలో సోఫాలున్నాయి. అయినా అతడు కూర్చోలేదు. గోడల్ని పరిశీలించసాగాడు. పటాలు అనేకం వున్నాయి గోడలకు—అన్నీ పరంధామయ్యగారు మంత్రిగా వుండినపుడు మహా నాయకులతో తీయించుకున్నవి. వాటిని చూచి ధైర్యం వచ్చింది రవికి, పరంధామయ్యగారి ఒక్క మాట—ఒక్క చీటీ—ఒక్క టెలిఫోను—తన పని జరిగిపోతుంది.

'చేస్తాడా పరంధామయ్య ?'

'ఎందుకు చేయడు?'

'ఎందుకు చేస్తాడు?'

ఇలాంటివే సరసకాల ఆశలు, నిరాశలతో సతమతం అవుతుండగా 'ఆఁ. ఏమబ్బాయ్' అంటూ ప్రవేశించాడు పరంధామయ్య.

పటాలమీంచి దృష్టి మళ్ళించి చూచాడు. పరంధామయ్య! దేవుడు ప్రత్యక్షం అయినట్లయింది. తబ్బిబ్బయినాడు—తత్తర పడ్డాడు రవి—అయినా ఎలాగో సమస్కరించాడు.

'రా—కూర్చో' అంటూ పరంధామయ్య సోఫాలవైపు నడిచి కూర్చున్నాడు.

రవి పరంధామయ్యతో నడిచాడు—కాని కూర్చోలేదు—సోఫాను పట్టుకొని నుంచున్నాడు.

"చాలా సేపైందా వచ్చి? రాత్రి మంత్రిగారికి పార్టీ ఇచ్చాను—చాలా పొద్దుపోయింది—ఏ తెల్లవారు జామునో పడుకున్నా—తప్పవు ఇవన్నీ మాకు—ఆ మంత్రి విదేశాలకు వెళుతున్నాడు—అందుకే ఆల స్యంగా లేచాను—మామూలుగానయితే తెల్లవారు జామునే లేస్తాను. నేను గాంధీజీ ఆత్మకథ చదివాను" ఇంకేవో చెప్పుకో పోతున్నాడు పరం ధామయ్య ఇవన్నీ తనకుఎందుకు చెప్తున్నాడో, తాను ఏమనాలో అర్థం కాలేదు రవికి - చేతులుపిసుక్కుంటూ నుంచున్నాడు రవి.

పరంధామయ్య రవిని జాలిగా చూచాడు. "అలా నుంచున్నావేం? కూర్చో. తప్పులేదు - మేం సోషలిజం తెస్తాం - పర్లేదు - కూర్చో - నాకు పెద్దా చిన్నా లేదు-అందర్నీ కూర్చోమంటా. అది సోషలిజం కాదా? కాదంటారు కొందరు - వాళ్ళకు తెలియదు అసలు సోషలిజం - నేను ఓడిపోయాను - కాకుంటే ఇప్పటికి సోషలిజం తెచ్చేవాణ్ణే". ఇంతవరకూ

బాగానే వుంది. రవి వింటూ పోతున్నాడు - రవి కేమీ అర్థం కాలేదు - అది అర్థం చేసుకోవటానికి కాదు వచ్చింది తను - తన పనికోసం. రవి చిక్కులో పడ్డాడు "ఏమంటావ్" అనే పరంధామయ్య ప్రశ్న విని.

తికమక పడ్డాడు రవి. అతని గొంతులోంచి అతనికి తెలియకుండానే వచ్చాయి పదాలు" - "అవునండీ, అక్షరాలా నిజం."

అద్గదీ అలా అను — అందరికీ అర్థం కావయ్యా ఇలాంటివి. తెలివి కలవాడిలా వున్నావు. రా, కూర్చో" అని లాగి తన ముందు సోఫాలో కూర్చోపెట్టాడు పరంధామయ్య రవిని.

రవికి ఇంద్రాసనం లభించినట్లయింది — అయినా ముళ్ళపీద కూర్చున్నట్లే కూర్చున్నాడు — బిక్క మొహం వేసి. అతని మనసు మాత్రం ఆనందంతో గంతులు వేస్తూంది — నీరు విడిచిన చేపలా.

"ఆఁ. చెప్పు, కాఫీ తాగుతావా? టీయా? కాఫీ సైతం తాగకుండా వచ్చేశాను ఎవరో వచ్చారంటే — ఎవరొచ్చినా పాపం పనిమీదే వస్తారుగా! నేను కాఫీ తాగుతూ కూచుంటే ఎలా? ఇలాంటి వాళ్ళనేనయ్యా జనం ఓడించేది. ఇదీ మన ప్రజాస్వామ్యం, ఏమంటావ్?"

"మరేనండీ" అన్నాడు రవి.

"సరేగాని ఇంతకూ కాఫీయా? టీయా?"

"ఇప్పుడెందుకులెండి—మీరు పుచ్చుకోండి!"

"బావుంది, నిన్ను వదిలి నేనా — మీరు యువకులయ్యా — మీ భుజస్కంధాలమీద వుంది భారతదేశపు బరువంతా. కాఫీ తెప్పిస్తా — సరేనా?"

"సరేనండి."

కాఫీ వచ్చింది. అప్పటికి రవి కొంత సర్దుకున్నాడు — కాఫీకప్పు తీసుకొని చప్పరించసాగాడు.

"ఇంతకూ వచ్చిన పని చెప్పావు కావు" పరంధామయ్య అడిగాడు.

రవి తన లోకంలోకి వచ్చేశాడు — పరంధామయ్య ముందు సోఫాలో కూర్చుని కాఫీ తాగుతున్న దర్జానుంచి ఇరుకు యింట్లోకి వెళ్ళిపోయాడు. మంచంలో ముసుగు కప్పుకొని పడుకున్న తల్లి — వయసు వచ్చీ వయసెరుగక బండచాకరీ చేస్తున్న చెల్లి — పుస్తకాల్లేక రాసుకున్న నోట్సు బట్టీ పెడుతున్న తమ్ముడు — ఇంటినిండా ముసురుతున్న ఈగలు — ముందున్న మురికి కాలువా — అమాంతంగా ముక్కు మూసుకున్నాడు — సగం తాగిన కప్పు టీపాయ్‌మీద పెట్టి, చేతులు ముడుచుకొని కూర్చుని విన్నవించాడు :

"నాకు ఫస్టుమార్కులు వచ్చాయండీ – చదువంటే అపేక్ష – నాన్న పోయారు – అమ్మకు క్షయ – చదువుకునే తమ్ముడున్నాడు – ఈవెనింగ్ కాలేజీలో చేరాను – ఏదైనా ఉద్యోగం చూపిస్తే – మీ దయ, జన్మ జన్మలకు ఋణపడి వుంటాం." తరువాత మాట్లాళ్ళేకపోయాడు.

"అలాగా పాపం!" చుట్ట వెలిగిస్తూ అన్నాడు పరంధామయ్య – సోఫాలో వాలిపోయి పొగ వదలసాగాడు!

పరంధామయ్యను చూస్తూ వుండిపోయాడు రవి.

మౌనం, నిశ్శబ్దం.

"రవీ" సోఫాలో ముందుకు వంగి చుట్ట బూడిద యాష్‌ట్రేలో దులుపుతూ అన్నాడు పరంధామయ్య. "అసలు ఈ పరీక్ష లెందుకయ్యా? నా కర్థంగాక అడుగుతాను. మీమీద నమ్మకంలేక కాదూ పరీక్షలు పెట్టేది! ఈ ప్రభుత్వానికి యువజనులమీద విశ్వాసం లేదయ్యా. ఉండి వుంటే యిలా జైల్లో కూర్చోపెట్టినట్టు కూర్చోపెట్టి ఎందుకు చెప్పు పరీక్షలు రాయించడం! మేం ఫలానా సబ్జక్టు చదివాం అని సర్టిఫికెట్టు యిస్తే ఆ యూనివర్శిటీవారు డిగ్రీలుపారేస్తే పోలా? వారికి ఖర్చూ తప్పె. అయినా

చదువుల్లో ఏముంది చెప్పు – తెలివి కావాలిగాని - అదెలాగూ డిగ్రీలలో రాదాయె. మేమేం చదివాం చెప్పు – నాకు డిగ్రీ వుందా! నేనూ నీలాగ పాతికేళ్ళ కింద ఉద్యోగం వెతుక్కుంటూ నానా గడ్డీ కరచాను. అదృష్టం బావుండి అవి దొరకలేదు – మంత్రినయ్యాను - మూడు టరమ్లు చేశా నయ్యా - చూస్తున్నావుగా యీ బంగళా – కారూ – అన్నీ స్వార్జితం – అదృష్టం బాగులేక యీ తడవ ఓడిపోయాననుకో - అయితేమాత్రం మళ్ళీ మంతిని కాకపోతానా – వీళ్ళకేం తెలుసునయ్యా ప్రభుత్వం చేయడం – మూడు టరముల అనుభవం వుంది. అందుకే సలహాలకు పిలుస్తుంటారు. ఇంతకూ ఏమంటావు చదువునుగురించి నా అభిప్రాయం. మోస్ట్ మోడరన్ కాదూ ?"

చిత్తరువులా కూర్చొని వింటున్న రవికి ఆ ప్రశ్న కొరడాదెబ్బలా తగిలింది.

"మీరు మోస్ట్ మోడరన్ సార్! ఎంత గొప్పగా అలోచించారు! కానీ అది అమలు జరపడం ఎలా సార్!"

"మీరు యువకులు, విద్యార్థులు. మీరు సాధించలేని దేముందయా- ముందడుగు వేయాలి – అంతే - ప్రభుత్వాలే మారిపోతాయి. సాధించా లయ్యా – అన్నీ సాధ్యమే. నువ్వే ఈ ఉద్యమానికి నాయకుడివి. ఏమం టావ్!"

అర్థం కాలేదు రవికి. అయోమయంలో పడిపోయాడు. తానెందు కోసం వచ్చాడు? తానేమి కానున్నాడు. ఊహించుకున్నాడు – ఏవో బంగారు కలలు కనిపించాయి. కలలు కరిగాయా – అమాంతంగా మురికి కొంపలో పడిపోతాడు.

"సార్! మా అమ్మ—క్షయ—తమ్ముడు...."

"అవన్నీ నేను చూసుకుంటాను. ఆ బాధ్యత నాది — నువ్వు

నాయకునివి కావాలి. నా అంతవాడివి కావాలి" అని జేబులోంచి పచ్చ కాగితాలు తీసి అందించాడు పరంధామయ్య.

కళ్ళు జిగేలు మన్నాయి రవికి! పచ్చ కాగితాలు! తన చేతిలో!! ఉబ్బి తబ్బిబ్బైనాడు — "సార్! మీ కెలా కృతజ్ఞత తెలుపుకోవాలి సార్ — మీ ఋణం ఎలా తీర్చుకోను సార్...." ఇంకేదో యిలాంటి స్తోత్రం చదివాడు.

"నువ్వు నాయకుడివి కావాలోయ్! నువ్వు గొప్పవాడివి కావాలోయ్" అని భుజంమీద చేయి వేశాడు పరంధామయ్య.

"నన్నేం చెయ్యమంటారు సార్" హనుమంతునిలా చేతులు జోడించి అడిగాడు రవి — ఆజ్ఞ అవుతే సమస్త లోకాలూ తగులపెట్టి వస్తా ననేంత ధ్వని వుంది అందులో.

మళ్ళీ చెప్పాడు పరంధామయ్య చదువుల గురించి తన అభిప్రాయాల్ని వివరంగా — "గుర్తుందిగా మన నినాదం — చెప్పు ఏమిటో" అడిగాడు పరంధామయ్య.

"పరీక్షలు కాదు — డిగ్రీలు కావాలి"

"యువజనులు సాధించలేనిది లేదు."

పిడికిలి బిగించి గట్టిగా నినాదం చేశాడు రవి.

"అంతే, మరేం లేదు, డబ్బును గురించి బాధపడకు" అని రవితోపాటు మెట్లు దిగిన పరంధామయ్య డ్రైవరును పిలిచి కారులో పంపించాడు రవిని.

వెళ్ళిపోతున్న కారును చూచి తృప్తిగా నవ్వాడు పరంధామయ్య.

కారో కూర్చున్న రవికి నేల కనిపించలేదు.

రవికి కాలేజీలో మిత్రులు పెరిగిపోతున్నారు, పరంధామయ్య నినాదానికి ప్రచారం ఎక్కువ అవుతూంది. ఒకనాటి సాయంకాలం రవి

తన మిత్రుల్తో దిగాడు—కార్లో—పరంధామయ్య సౌధానికి. పరంధామయ్య వారికి స్వాగతం యిచ్చాడు. వచ్చినవారూ, పరంధామయ్యా పరమ సంతోషించారు. వచ్చినవారికి సంతోషం పరంధామయ్య పరిచయం లభించినందుకు. పరంధామయ్యకు సంతోషం తన పాచిక పారుతున్నందుకు. పరంధామయ్య వారితో పరమ ఆప్తునిలా మాట్లాడారు. పరీక్షల్ని గురించి వివరించాడు — నిరుద్యోగ సమస్యని గురించి వాపోయాడు — యువజనుల శక్తిని కొండంతలుచేసి చెప్పాడు. అంతేకాదు, టేబిలీమీద బాటిల్ ఓపెన్ చేశాడు. సోడాలు బుస్సుమన్నాయి. గ్లాసులు కణకణ మన్నాయి. రవికీ, అతని మిత్రులకి పరంధామయ్య చెప్పింది అప్పుడు బాగా అర్థం అయింది.

తెల్లవారింది. మత్తు మత్తుగా కదిలారు రవీ, అతని మిత్రులూ. సాగనంపాడు పరంధామయ్య. ఆశల రెక్కలు తొడుక్కొని ఎగిరిపోయారు వచ్చినవారు.

అలా వెళ్ళినవారు ఊరుకోలేదు, కాలేజీలో కల్లోలం లేపారు. "పరీక్షలు కాదు డిగ్రీలు కావాలి" అని నినాదాలు చేశారు. కుర్రాళ్ళు కాలేజీ వదిలేశారు. పత్రికల్లో పతాక శీర్షికల్లో నినాదం వచ్చింది.

రవి మురిసిపోయాడు.

రవి పలుకుబడి హెచ్చుతూంది, అతనికి విరామం ఉండడంలేదు కారు, కార్లు, కాలేజీలు, చర్చలు, ఉపన్యాసాలు.

రవి ఛోటా నాయకుడై పోయారు. అతడు ఉద్యోగం మరిచాడు, ఇల్లు మరిచాడు. ఉన్నత పదవుల గురించి కలలుగంటున్నాడు.

రవి ఒక మహాసభ ఏర్పాటు చేశాడు. పరంధామయ్య ఉపన్యసించాడు.

"విద్యార్థులారా! యువజనులారా! భావి భారత అధినేతలారా!" అని ప్రారంభించేసరికి విద్యార్థుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది—వారు చప్పట్లు కొట్టారు, ఈలలు వేశారు. పరంధామయ్య గొంతు సవరించుకొని మళ్ళీ సాగించాడు. ఆయన మహోపన్యాసం ఇచ్చాడు-రవికంటె ఒక అడుగు ముందుకు వేశాడు.

"మనకు పరీక్షలువద్దు. డిగ్రీ వద్దు. ఉద్యోగాలు కావాలి—ఉద్యోగాలు—ఉద్యోగాలులేని డిగ్రీలు కడుక్కు తాగుతామా? యువజనులారా! ఒకే ఒక్కమాట అడగండి ప్రభుత్వాన్ని—మాకు ఉద్యోగాలు కావాలి-అంతే డిగ్రీలు వద్దు-పరీక్షలూ వద్దు"

ఉపన్యాసం విన్నజనం ఉక్కిరి బిక్కిరి అయినారు. ఉబ్బితబ్బిబ్బైనారు. పరంధామయ్యకు జై కొట్టారు. అతన్ని ఎత్తుకొని ఎగిరారు. వీరంగం వేశారు—ఈలలు కొట్టారు.

ఆ రాత్రి పరంధామయ్య ఇంటో పెద్ద పార్టీ అయింది విద్యార్థులు సమ్మె చేయాలని నిశ్చయించారు.

పత్రికలు వార్తలు ప్రకటించాయి.

ప్రభుత్వం బిత్తరపోయింది.

అయినా సమ్మె ఆగలేదు.

సమ్మె రోజుకు ముందు రవి వంటరిగా పరంధామయ్య ఇంటికి వచ్చాడు. వచ్చినవాడు యింటిముందున్న వస్తాదుల్ని చూచి వణికిపోయాడు. పరంధామయ్య అతనికి అభయం ఇచ్చాడు.

వస్తాదుల్ని ఎందుకు రప్పించిందీ వివరించాడు.

"ఈ ప్రభుత్వం ఉంది చూచావూ! వట్టి సమ్మెలకు లొంగదు. కొంత హింస కావాలి. కొన్ని బస్సులు తగలబడాలి—కొన్ని కాల్పులు జరగాలి, కొందరు ఒరగాలి, కొన్ని రైళ్ళు నిలవాలి. కొన్ని లైట్లు పగలాలి. ఇవన్నీ మీరు చేయగలరా?"

రవికి ఏమీ అర్థంకాలేదు. అతడు జవాబు చెప్పలేదు. కళ్ళప్పగించి చూచాడు అంతే.

పరంధామయ్య జవాబు చెప్పాడు. "చేయలేరు. అందుకే వీళ్ళను పిలిపించాను వీళ్ళు అన్నీ చేయగలరు చేస్తారు. నువ్వు ఇంకా కుర్రాడివి. నాయకుడివి కావల్సిన వాడివి-అందుకే చెప్తున్నా. అన్నీ సక్రమంగా ఉన్నాయా ?" అడిగారు పరంధామయ్య.

అంతా సక్రమంగా ఉందని ఎంతో ధైర్యంగా చెప్పాడు రవి. ఎవరో కొందరు మాత్రం ఇది స్వార్థపరులు పన్నాగం అంటున్నారుగాని మెజారిటీ సమ్మె చేస్తున్నారు అన్నాడు. కాలేజీలో ప్రవేశించేవారి కాళ్ళిరగ కొట్టే యేర్పాట్లు చేయించానన్నాడు రవి.

పరంధామయ్య రవిని మెచ్చుకున్నాడు, పైకి వస్తావని వీపు చరిచాడు.

రవి పొంగిపోయాడు.

సమ్మె మొదలయింది. విద్యార్థులు రెండు పక్షాలుగా విడిపోయారు. కాలేజీముందు కురుక్షేత్రం సాగింది, పోటాటలు, కుస్తీలు, కుమ్ములాటలు, కొందరికి గాయాలు తగిలాయి, కొందరు ఆస్పత్రుల్లో చేరారు.

ప్రభుత్వం జోక్యం కలిగించుకోలేదు. పరిస్థితి ప్రశాంతంగా ఉందని ప్రకటించింది.

రోజులు గడుస్తున్నాయి. ఉద్రేకాలు పెరుగుతున్నాయి. కాలేజీ ధ్వంసం అయింది, ఫర్నిచర్ తగలపడింది. పోలీసు దిగింది—లాఠీచార్జి చేసింది. టియర్‌గ్యాస్ వదిలింది. విద్యార్థులు కాలేజీ వదిలి వీధులుపట్టారు. బ్రహ్మాండమైన ఊరేగింపు సాగింది, విద్యార్థుల్లోంచి రాళ్ళ వానకురిసింది. వీధుల్లోని దుకాణాల అద్దాలు బద్దలయినాయి. పోలీసులు లారీ దిగారు.

కాల్పులు జరిపారు. ఆ తర్వాత టియర్ గ్యాస్ వదిలారు—వెంట తరిమి లాఠీచార్జీ చేశారు.

బస్సులు తగులబడ్డాయి.

వీధి లాంపులు ముక్కలయినాయి.

పట్నంలో ఉద్రేకం ప్రబలిపోయింది హింస పుఠివిప్పి ఆడింది. ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకున్నారు. పత్రికలు నోళ్ళు విప్పి పెనుకేకలు పెట్టాయి.

ప్రభుత్వం మేల్కొన్నది—సమ్మె మానమనీ, శాంతంగా ప్రవర్తించమనీ విన్నవించింది. విన్నపాలు వమ్ము అయినాయి. సంప్రదింపులకు రావలసిందని విద్యార్థులను పిలిచింది.

పరంధామయ్య పెద్ద సభ చేశాడు అది విద్యార్థుల విజయం అన్నాడు—సంప్రదింపులకు తానే పోతానన్నాడు—విద్యార్థులు ఏకగ్రీవంగా అంగీకరించారు.

సంప్రదింపులు ప్రారంభం అయినాయి - సమ్మె సాగుతూనేవుంది·

సంప్రదింపులకు వెళ్లిన పరంధామయ్య ప్రభుత్వాన్ని వెక్కిరించాడు—బేరం ప్రారంభించాడు—తనను కనీసం మంత్రిని చేయకుంటే దేశం తగలబడుతుందన్నాడు. తన శక్తిని అంచనా వేసుకొమ్మని వెకిలిగా నవ్వాడు సిగరెట్టు దమ్ము గట్టిగా లాగాడు—ఆతర్వాత మాట్లాడలేదు.

ప్రభుత్వం బిత్తరపోయింది. దానికీదీనికీ సంబంధంఏమని అడిగింది.

"అందులోనేవుంది రాజకీయాపు చిట్కా, మీరు ఇవ్వనసండి నేను వెళ్ళిపోతా" అన్నాడు పరంధామయ్య.

ప్రభుత్వానికి అర్థంకాలేదు. "మీరిలా అన్నారని వారికి చెబితే," ఒక్క ప్రశ్నవేసింది.

"చెప్పి చూడండి! వారు మిమ్మల్ని నమ్మరు."

బయట నినాదాలు మొదలయినాయి. పరంధామయ్య జయ జయ ధ్వానాలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం దిగివచ్చింది—మరేదైనా పదవి ఇస్తానంది. అయితే యిప్పాలికి సంప్రదింపులు ఆపేద్దామన్నాడు పరంధామయ్య. రేపు మళ్ళీ కొనసాగించుదామన్నాడు. బయటికివచ్చిన పరంధామయ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయనీ ప్రభుత్వం కొంత దిగి వచ్చిందనీ ప్రకటించాడు.

విద్యార్థులు ఆయన్ను ఎత్తుకొని గంతులువేశారు.

సంప్రదింపులు చాలాకాలం కొనసాగాయి. అయినా సమ్మె ముగిసింది.

చివరకు పరంధామయ్య మంత్రి అయినాడు — అందుకు రవి పొంగిపోయాడు — తొలుత పరంధామయ్యకు అభినందనలు చెప్పినవాడు రవి.

రవి బ్రహ్మాండమైన అభినందన సభ ఏర్పాటు చేశాడు — ఒక లారీ పూలదండలు పడ్డాయి పరంధామయ్య మీద. పరంధామయ్య బ్రహ్మాండమైన ఉపన్యాసం యిచ్చాడు. తనను మంత్రిని చేసినందుకు విద్యార్థులకు, యువజనులకు కృతజ్ఞత చెప్పాడు. పరీక్షలు లేకుండా డిగ్రీలు, డిగ్రీలు లేకుండా ఉద్యోగాలను గురించి విచారించటానికి ఒక కమిటీ వేశామని చెప్పగానే కరతాళ ధ్వనులు మిన్నుముట్టినవి. మరొక వైపునుంచి పాత చెప్పులూ, కుళ్ళిన టమాటాలు వేదికపై పడ్డాయి. దాంతో సభలో కల్లోలంచెలరేగింది.

పరంధామయ్య ఫారిన్ కారులో బయటపడ్డాడు.

కాలం ఎవరికోసం ఆగింది? గడిచిపోతూనే వుంది. రవికి మళ్ళీ గడ్డురోజులు వస్తున్న జాడలు కనిపించాయి. పరంధామయ్యను కలుసుకుందామన్నా కనిపించటంలేదు.

ఒక రోజు పట్టుదలగా బయలుదేరాడు. పరంధామయ్య ఇంటి ముందున్న గూర్ఖా రవిని ఆపుచేశాడు. రవికి కోపం వచ్చింది. గూర్ఖామీద గుర్రుమన్నాడు. గూర్ఖా అతన్ని మెడపట్టి గెంటేశాడు రవి నేలమీద పడిపోయాడు. గాయాలు తగిలాయి, గుండెలో మంటలు చెలరేగాయి.

రవి నేరుగా కాలేజీకి వెళ్లాడు. పరంధామయ్య నిజస్వరూపాన్ని గురించి వివరించాడు. మంత్రి అయి విద్యార్థుల్ని మరిచాడన్నాడు అసలు మోసపోయింది తామేనన్నాడు. చాలా ఉద్రేకంగా మాట్లాడాడు. పరంధామయ్యను సవాలు చేయాలన్నాడు. బయలుదేరింది విద్యార్థిదళం.

పరంధామయ్య యింటిమీద బ్రహ్మాండమైన దాడి జరిగింది. పరంధామయ్య ఇంటిముందు కాల్పులు జరిగాయి.

రవి తుపాకి గుండుకు బలి అయినాడు.

"విద్యార్థులు రాజకీయాల్లో పాల్గొనరా"దని పత్రికాప్రకటన చేశాడు పరంధామయ్య.